ప్రాణం.. పదిలమేనా..?

అనుమతులు లేని ఆస్పత్రులెన్నో..

- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- వాటిపై వైద్యారోగ్యశాఖ కన్నెర్ర
- 4 ప్రైవేట్ ఆస్పత్రులు, ఒక ల్యాబ్ సీజ్
- మరో క్లినిక్‌కు షోకాజ్ నోటీసు జారీ



గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో నోటీసులు అందజేస్తున్న వైద్యాధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు పదుల సంఖ్యలో ఉన్నాయని భావిస్తున్న వైద్యఆరోగ్య శాఖ వాటిని గుర్తించే పనిలో నిమగ్నమైంది. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టించుకోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలకు సిద్ధవుతోంది. ఇప్పటికే జిల్లాలో ఉప్పల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులు(క్లినిక్స్), ఒక ల్యాబ్‌ను సీజ్ చేసిన జిల్లా వైద్యారోగ్యశాఖ మరో క్లినిక్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపీ, డయాగ్నస్టిక్ సెంటర్లు, రిహాబిలిటేషన్ సెంటర్లపై కొరడా ఝులిపించేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

వసూళ్లలో ఇష్టారాజ్యం..

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఫీజుల వసూళ్లలో మొదలుకొని వైద్య పరీక్షలు తదితర వాటి విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పసిగట్టిన జిల్లా వైద్యారోగ్య ఆస్పత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఫీజులకు సంబంధించిన ధరల పట్టిక జాబితాతో సహా డాక్టర్లు, సిబ్బంది, బెడ్ల సంఖ్య వంటి విషయాలను పొందుపర్చాలని సూచిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

అనుమతి ఉన్నవి 1605 ఆస్పత్రులే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,500 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నాయి. అందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో నడుస్తున్న ఆస్పత్రులు 1605 మాత్రమే ఉన్నాయి. అందులో 100 కంటే ఎక్కువ పడకలు(బెడ్లు) కలిగి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉన్నాయి. 20 నుంచి 100 పడకలు(బెడ్ల) వరకు ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు (బెడ్లు) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. అలాగే, పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు 712, డెంటల్ ఆస్పత్రులు 180, ఫిజియోథెరపీ సెంటర్లు 46, రిహాబిలిటేషన్ సెంటర్లు 8, అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉండగా, ఏ అనుమతి లేని 400 సాన్కింగ్ సెంటర్లు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అంచనా వేస్తోంది.

7 రోజుల్లోనే ఐదు క్లినిక్‌లు సీజ్

తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు గతనెల 27న వైద్య బృందం ఉప్పల్‌లోని శ్రీమణికంఠ హెల్త్‌కేర్ అండ్ పాలీ క్లినిక్, చిలుకానగర్‌లోని శ్రీరాజు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసిన వైద్య బృందం అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది లేరని గుర్తించి వాటిని సీజ్ చేశారు. అలాగే, సరైన డాక్యుమెంట్స్ లేని చిలుకానగర్ మెసర్స్ మహాలక్ష్మి క్లినిక్‌కు నోటీసు జారీ చేశారు.

◆ ఈ నెల 3న షాపూర్‌నగర్‌లో ఆర్‌ఆర్ శ్రీజన్ క్లినిక్, శ్రీవీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, అన్నపూర్ణ ల్యాబ్‌లను తనిఖీ చేసిన వైద్య బృందం అర్హతలేని వైద్యులు, సిబ్బందితో వాటిని నడుపుతున్నారని గుర్తించి, వాటిని సీజ్ చేశారు. గత సంవత్సరంలో ఇదే సీజన్‌లో పీర్జాదిగూడలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్యబృందం స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి మరో 4 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర విషయాలపై వైద్యారోగ్యశాఖ ఆరా తీస్తోంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించటంతో పాటు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. వాటిని గుర్తించేందుకు వివరాలు సేకరిస్తున్నాం. తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ ఆస్పత్రిలోని బోర్డుపై డాక్టర్లు, సిబ్బందితో సహా అన్ని వివరాలు, సమాచారం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డా.రఘునాథస్వామి, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

నకిలీ వైద్యులతో వైద్యం

గోకుల్‌నగర్ గీతా ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని సైనిక్‌పురి, గోకుల్‌నగర్‌లోని గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో అర్హత లేని నకిలీ వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తూ రోగులకు మందులు రాస్తుండటంతో ఆ కేంద్రాన్ని సీజ్ చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. శనివారం గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో తనిఖీలు నిర్వహించగా, నకిలీ వైద్యుల విషయం బయటపడిందని తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్‌ఎంసీ చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో గీతా ప్రథమ చికిత్స కేంద్రంతో సహా నకిలీ వైద్యులపై ఎఫ్ఆర్ఐ నమోదైందన్నారు. తనిఖీల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథస్వామి, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఆనంద్, డాక్టర్లు కపూర్, శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, పోలీసు అధికారులు ఉన్నారు.





గీతా ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తూ..

త్యాగానికి ప్రతీక రంజాన్



ఉప్పల్: రంజాన్ పవిత్ర మాసం త్యాగాలకు ప్రతీక అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్ డివిజన్ చిన్న మజీద్‌లో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్థానిక బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే

మల్కాజిగిరి: మల్కాజిగిరి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సందడిగా జరిగింది. యూకేజీ, ఐదవతరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సందర్భంగా చిన్నారుల ఆటపాటలతో అలరించారు. అనంతరం వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లితండ్రులు, కరస్పాండెంట్ మంచాల శ్రీనివాస్, హెచ్‌ఎం హారిక,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అబ్జర్వర్‌గా నయీమ్‌ఖాన్



మల్కాజిగిరి: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నుండి మల్కాజిగిరికి చెందిన సీనియర్ నాయకుడు నయీమ్‌ఖాన్ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఏఐసీసీ మైనారిటీ విభాగం వైస్ చైర్మన్ ఫర్హాన్ అజ్మీ నయీమ్‌ఖాన్ నియామకాన్ని ప్రకటించారు. నయీమ్‌ఖాన్ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలి



బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణనివ్వాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ కార్యవర్గ సభ్యులు రాంచందర్‌రావు అన్నారు. బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన హమ్ ఫిట్ తోహ్ భారత్ ఫిట్ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేహ దారుఢ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పర్వతారోహకురాలు జాహ్నవి, పాఠశాల వ్యవస్థాపకులు రితేష్, ప్రధానోపాధ్యాయురాలు కస్తూరిరెడ్డి పాల్గొన్నారు.

కొత్త తెలుగు సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలి

బోడుప్పల్: కొత్త తెలుగు సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ అన్నారు. మేడిపల్లిలో వెంకట రామకృష్ణ ప్రసాద్‌శర్మ రూపొందించిన పంచాంగాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప్పల్ శ్రీనివాస్, రంగయ్య, శ్రీనివాసులు, నాగభూషణం, రాజేశ్వర్, సత్యనారాయణ, సంతోష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రాజు పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతివ్వండి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత అనుముల నర్సింహారెడ్డిని శనివారం బీజేపీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు మద్దతుగా బీజేపీలో చేరాలని ఆయనను ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌తో కలిసి ఈటల సుమారు గంట పాటుగా అనుములతో చర్చలు జరిపి తనకు సహకరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



మల్కాజిగిరి: రంజాన్ మాసం ఉపవాసదీక్షలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని తన నివాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మదార్సాలో చదువుతున్న విద్యార్థులు ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి



బోడుప్పల్: మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ అన్నారు. ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో లర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ సహకారంతో గత 5 నెలలుగా మహిళలు శిక్షణ పొందగా శనివారం ఆయన చేతుల మీదగా వారికి టైలరింగ్ శిక్షణ సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను మహిళలు అంది పుచ్చుకుని స్వయంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

కుషాయిగూడ: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నోమ కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, స్థానిక నేతలు ఎనుముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నా స్థానికతపై ప్రశ్నించే హక్కు లేదు..

చర్లపల్లి పారిశ్రామికవేత్తల ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్



పారిశ్రామికవేత్తల ఆత్మీయసమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కుషాయిగూడ: నా స్థానికతపై ప్రశ్నించే నైతిక హక్కు మీకు లేదు..మల్కాజిగిరి ఎవ్వడబ్బ జాగీరుకాదు మీతో నాకు పోలికేంటి.. ఆదిలాబాద్ నుంచి అల్లంపూర్, భద్రాచలం నుంచి పరిగి వరకు ఎక్కడైనా పోటీ చేస్తా..ఈటల అందరి పొత్తుల సద్దని గ్రహించాలని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో శనివారం జరిగిన పారిశ్రామికవేత్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన ముఖ్యమంత్రి స్థానికుడా..ఇది నా స్థానం ఎక్కడ ఓడిన పర్వాలేదు కానీ మల్కాజిగిరిలో మాత్రం గెలవాలంటున్న ముఖ్యమంత్రిని నుద్దేశించి ఆయన పై విధంగా స్పందించారు. దమ్ములేక చిల్లర ఆరోపణలు చేసేవారు నా చరిత్ర తెలుసుకొని ఆరోపణలు చేయాలన్నారు. రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలన్న, దేశం ప్రశాంతంగా ఉండాలన్నా.. అభివృద్ధి చెందాలన్నా తిరిగి మోదీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, సిఐఏ అధ్యక్షుడు గోవిందారెడ్డి, టీఫ్ అధ్యక్షుడు సుదీర్‌రెడ్డి, గోపాలరావు, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



గౌతంనగర్: విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఏర్పర్చుకోవాలని ట్రాఫిక్ సీఐ శివశంకర్ అన్నారు. శనివారం సాయంత్రం శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులతో కలిసి గౌతంనగర్ చౌరస్తాలో ట్రాఫిక్, రహదారి భద్రతా నియమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శాంతినికేతన్ స్కూల్ కరెస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపల్ విద్యా, స్థానికులు కరుణాకర్, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



బోడుప్పల్: సీనియర్ సిటిజన్స్ తమ అనుభవాలను పంచుకుంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ 20 డివిజన్‌లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ తన జీవిత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు సూచనలు, సలహాలు చేయాలని ఆయన కోరారు. కార్పొరేటర్ కొడె పోచయ్య, నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, మనోరంజన్ రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జనజాతర సభకు తరలిన నాయకులు



కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బస్సులో తరలివెళుతున్న కార్యకర్తలు



ఉమేష్‌సింగ్ ఆధ్వర్యంలో బస్సులో తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం తుక్కుగూడలో జరిగన జనజాతర బహిరంగ సభకు మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ల నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు ఉమేష్ సింగ్, సీనియర్ నాయకుడు జీఎస్వీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివెళ్లారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విశ్వప్రభ దేవి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కస్తూరి తిలకం, గురుబ్రహ్మ, గజానన, ఆంగికం భవనం, వినాయక కౌతం, కొలువైతివా, జతిస్వరం, కృష్ణంకలియసఖి, బ్రహ్మాంజలి, దశావతారం, రామాయణ శబ్దం, స్వర జతి తదితర అంశాలను కళాకారులు, విదిష, సాన్విక, యువిన, ప్రణవి, లక్ష్మీప్రియ, వసుధ, సంజన,రుచిక, సహస్ర మోక్ష తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

దేశ భద్రత మోదీతోనే సాధ్యం..



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

అల్వాల్: అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్లలో శనివారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ భద్రత ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు. బీజేవైయం మాజీ అధ్యక్షులు భాను ప్రకాష్, నాయకులు సురేందర్‌రెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.

గౌతంనగర్: బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ శనివారం మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో మార్నింగ్ వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి జరిగిందన్నారు.

మహిళల ఉపాధికి సంపూర్ణ తోడ్పాటు



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్

కుషాయిగూడ: వివిధ రంగాల్లో శిక్షణ పొందిన మహిళల ఉపాధికి తమ సంపూర్ణ తోడ్పాటునందిస్తామని కెనరా బ్యాంకు లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. అభయ అసోషియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో మహిళలకు అడ్వాన్స్ టైలరింగ్, డిజిటల్ మీడియాపై నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అభయ అధ్యక్షురాలు దేరం ఉష, అనిత, సుచిత్రారెడ్డి, షకీలా, షిరిడినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



అల్వాల్: అల్వాల్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతన ధ్వజస్తంభం పునప్రతిష్ట నిర్వహించి 40 రోజులు అయిన సందర్భంగా శనివారం హోమం, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..మేడిపల్లికి చెందిన సాయిగణేష్(20) అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ చదవుతున్నాడు. రోజు మాదిరిగానే బైక్‌పై ఇంటి నుంచి కాలేజీకి బయలుదేరాడు. మార్గమధ్యలో వరంగల్ హైవే నారపల్లి సమీపంలోని నందనవనం వద్ద ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయాడు. ఆ సమయంలో బైక్ అదుపుతప్పి లారీ కిందకు దూసుకెళ్లాడు. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సాయిగణేష్ మృతితో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బీజేపీ జెండా ఆవిష్కరించిన కార్పొరేటర్ శ్రవణ్



జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

మల్కాజిగిరి: బీజేపీ 44 వ ఆవిర్భావ దినోత్సవం మల్కాజిగిరి డివిజన్‌లో ఘనంగా జరిగింది. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ మల్కాజిగిరి, ఆర్‌కెనగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, శ్రీకాంత్, బాలలింగం, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజల పార్టీ బీజేపీ : కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్ : ఇందిరానగర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు కార్యకర్తలు, నేతలతో కలిసి జెండా బీజేపీ జెండావిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని 90 శాతం ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారని ప్రజల సంక్షేమం అభివృద్ధి కోరే పార్టీ బీజేపీ అని ఆమె అన్నారు. మరోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని ఎన్నుకోవడానికి దేశ ప్రజలు నిర్ణయించుకున్నారని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, కృష్ణమూర్తి, ప్రభులింగం పాల్గొన్నారు.

సుస్థిర సుపరిపాలన బీజేపీతోనే సాధ్యం

రామంతాపూర్ : బీజేపీ వ్యవస్థాపక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రామంతాపూర్ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన టిఫిన్ బాక్సు బైటక్ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరై కార్యకర్తలు నేతలతో కలిసి సామూహికంగా అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 ఏళ్ళ క్రితం ముంబాయిలో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ ప్రజల విశ్వాసాన్ని పొంది దేశంలో ప్రధాన పార్టీగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్‌రావు, చేనతో పాటు వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బోడుప్పల్: బీజేపీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ అన్నారు. బోడుప్పల్ 15వ డివిజన్ టెలిఫోన్ కాలనీలో కలకొండ సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన బిజెపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నవీన్, కాంతారెడ్డి, పాండు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



టిఫిన్ బాక్సు బైటక్‌లో పాల్గొన్న ప్రభాకర్



నాచారంలో బీజేపీ పార్టీ పతాక ఆవిష్కరణలో పాల్గొన్న బీజేపీ నేతలు



ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆనంద్